# జాతికుక్కలూ, నాటుకుక్కలూ

ఇటీవల దిబ్బనగరాలలో జాతికుక్కల హడావుడి జాస్తిగా ఉంటున్నది. ఇవి దిబ్బ చరిత్రలో ముందు ముందు ఘనమైన పాత్ర నిర్వహించే లక్షణాలు కనిపిస్తున్నాయి.

నిజానికి ఈ జాతి కుక్కలు దిబ్బదేశానికి కొత్తకాదు. రెండు వందల ఏళ్ళుగా ఇవి దిబ్బచరిత్రలో పెద్ద పాత్ర నిర్వహించినవే కూడానూ. అయితే దిబ్బదేశం స్వతంత్రం కాగానే వీటి శకం అయిపోయిందని అనుకున్నాం. దిబ్బ స్వాతంత్ర్య మహోత్సవం జరిగిన మర్నాటి నుంచీ ఈ జాతికుక్కలు తుగిడీలుగా తుగిడీలుగా వెళ్ళిపోతూంటే ఒక చిన్న అశ్రువుకూడా రాల్చాం. పెళ్ళి అంపకాలప్పుడు అందరికీ దుఃఖం పొంగివస్తుంది. పిల్లను ఎట్లా వదిలించుకుందామా అని తపస్సుచేసిన తల్లిదండ్రులకూ, దాన్ని తమ పిల్లవాడికి చేసుకో నిరాకరించిన బంధువులకూ కూడా ఆ క్షణంతో కళ్ళు చెమ్మగిల్లుతాయి. అదే విధంగా జాతికుక్కలు వెళ్ళిపోతుంటే దేశభక్తులకుకూడా— మళ్ళా మాట్లాడితే, దేశభక్తులకే — దుఃఖం పొంగి పొర్లింది. ఊరకుక్కలూ, జాతికుక్కలూ గాఢాలింగనాలలో ఇరుక్కుపోయి ఎంతకూ వీడ్కోలివ్వలేక పోయాయి. ఈ దృశ్యాలను ఫిల్మ్‌చేసి సినీ కెమెరా లెన్సులు మసకపారాయి. ఈ వార్తలను కూర్చే కంపోజిటర్లు ఆవేశంలో అచ్చుతప్పులు దొర్లించారు. దిబ్బ నాటుకుక్కల స్వాతంత్ర్యసమర చరమ పరిణామం విరహవేదనతో కూడిన వీడ్కోలు సన్మానం. ఈ ఘట్టాన్ని రాయబూనుకునే ప్రతి భావి చరిత్రకారుడూ ఇక్కడికి వచ్చేసరికి వలవలా ఏడుస్తాడని నిరాఘాటంగా చెప్పగలను.

కాని ఈ జాతికుక్కల నిష్క్రమణ కూడా నాటు కుక్కలకు కంటితడి లాగే, కేవలం ఒక పెళ్ళివేడుక అయిపోయింది—స్నాతక మప్పుడు పెళ్ళి కొడుకు గొడుగు వేసుకుని కాశీకి బయలుదేరినట్టు ! ఎందుకంటే జాతి కుక్కలు తిరిగివచ్చాయి—మూడు నిద్రలుచేసి పెళ్ళి కూతురు తిరిగివచ్చినట్టు !

అయితే—ఏ మాట కామాటే చెప్పాలి—జాతి కుక్కలు నిష్క్రమించినందుకు నాటు కుక్కల్లో అధిక భాగం ఆనందించాయి. (ఈ విషయం న్యూస్‌రీల్స్‌లోగాని, పత్రికల్లోగాని రాలేదు.) జాతికుక్కలు తమను తమ స్వస్థానంలోనే ఎంత హేయంగా చూశాయో, తమ్ము ఎట్లా వేటాడాయో ఎంత హింస పెట్టాయో, ఎట్లా నిర్బంధించాయో అవి మిద్దెల్లో కూర్చుని పంచభక్ష్యాలూ తిని మొరుగుతూ తమ చేత ఎంగిలాకులు ఎట్లా నాకించాయో నాటు కుక్కలు మరువలేదు. కోట్ల సంఖ్యలో ఉన్న పెద్దింటి నాటుకుక్కలు జాతి కుక్కలకు వీడ్కోలు

వేడుకలు జరుగుతూండే తతిమ్మా కుక్కలస మంచిపోయింది. కాని వాటి మూతులు కట్టి వేయటంవల్ల మొరిగే అవకాశం లేకపోయింది. గుర్రు పెట్టాయిగాని బాండువాళ్ళ మోతల్లో ఈ గుర్రు వినిపించలేదు...

జాతి కుక్కలను చూసి నాటు కుక్కలు గుర్రు పెట్టటం సంకుచితత్వమని అధిష్ఠాన శునకవర్గాల అభిప్రాయం. అది ప్రాచీన దిబ్బ సంస్కృతికే విరుద్ధం. శత్రు మిత్ర విచక్షణ దిబ్బ ఆధ్యాత్మిక సంపదకు గొప్ప కళంకం. ఎట్లాగైనా కుక్కబుద్ధి కుక్కబుద్ధే. గనక, మిత్రులకన్న శత్రువులనే ఒక పిసరు హెచ్చు ఆదరంతో చూడటం దిబ్బ ఆదర్శాలలో ఒకటిగా అమలు జరపబడింది.

అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించుకున్న ఒక దిబ్బ కుక్కతో నేను మాట్లాడాను. "మనం ఇవ్వాళ స్వతంత్రులం. ద్వేషించటం బానిస లక్షణం. బానిసలంగా ఉన్నప్పుడు జాతి కుక్కల్ని ద్వేషించాం. ఇప్పుడు మనకు వాటి స్నేహం కావాలి. అవి వెనక మనల్ని చూసి కోరలు చూపేవి. ఇప్పుడు తోకలాడిస్తాయి. నేను ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు నన్ను జాతికుక్కలు తమతో దాదాపు సమంగా చూశాయి. ఇందుకే గదా మనం స్వాతంత్ర్య సమరం సాగించింది?... అదీ గాక మనం జాతి కుక్కలకు చాలా ఋణపడి ఉన్నాం. స్వతంత్ర దిబ్బకు రాజకీయ సంస్కృతీ భిక్ష పెట్టింది జాతికుక్కలు కావా? రేపు ప్రాంతీయ కుక్కలు తమ అభ్యుదయం కోసం పేచీ పెడితే వాటిని మనం వేటాడటానికి జాతి కుక్కల పద్ధతులు అవలంబించమా? రేపు ఎర్రకుక్కలు విజృంభిస్తాయి. వాటిని అణచటానికి జాతికుక్కల సలహా సౌకర్యాలు ఉండవద్దా! మనం జాతి కుక్కల దగ్గిర నేర్చుకోవలసిన దంతా ఇంకాముందే ఉంది!" అన్నది ఈ నాటుకుక్క.

నిజానికి ఇంకొకటికూడా చెప్పుకోవాలి. రాజకీయాలనీ, రాజకీయవాదాలనీ ఎన్ని అనుకున్నా, దిబ్బదేశానికి జాతి కుక్కలు వచ్చింది విదేశీద్రవ్య సంరక్షణార్థం. విదేశీద్రవ్యం ఇంకా దేశంలో ఉండనే ఉంది. పైగా విదేశీద్రవ్యం నానాటికీ మరింత హెచ్చుగా దిగుమతి అవుతున్నది. ఒకప్పుడు స్టెర్లింగ్ ద్రవ్యమే ఉండేది. ఇప్పుడు డాలర్ ద్రవ్యం కూడా చేరుతున్నది. అందుచేత స్టెర్లింగ్ కుక్కలకూ, డాలర్ కుక్కలకూ దిబ్బదేశంలో స్థానం ఉన్నది.

యుద్ధానికి పూర్వం[1] దిబ్బ కుక్కలకు డాలర్ కుక్కలతో అంత పరిచయంలేదు. అవి చాలా స్వల్ప సంఖ్యలో ఉండేవి. అయినా గొర్రెకాపరి కుక్కలు. అందుకుని నిరపాయమైనవిగా భావించబడేవి. ఇప్పుడు దిబ్బదేశంలో అధికారరీత్యా డాలరుకుక్కలకు గౌరవ ప్రతిపత్తులజాస్తి.

అయితే ఈ డాలరు కుక్కల్ని గురించి గిట్టని వాళ్ళు చాలా ఘోరంగా చెప్పుకుంటారు. వీటికి పిచ్చి ఉందనీ, ఇవికరిస్తే తీరనిదాహాలు పుట్టుకొచ్చి క్రమేపీ మతిపోతుందనీ, వీటిని మనిషివేటలో తరిఫీదుచేసి, మనిషిరక్తం అలవాటు చేశారనీ బహిరంగంగానే చెప్పుకుంటారు.

1. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం.

కాని ఆధ్యాత్మిక చింతగల దిబ్బకుక్కలు తమ మిత్రులైన డాలరుకుక్కలను గురించి ఇటువంటి అపోహలు పడటం గాని, ఈ బాపకుహార్తలలో నిజానిజాలు ఆరా తీయటంగానీ భావ్యమైన పని కాదు. ఎవరి కర్మ వారినే కట్టికుడుపుతుంది.

డాలరు కుక్కల స్నేహం జరిగిన నాటు కుక్కలకు పైకిరావాలనే ఆత్రమూ, వేటాడాలనే సంరంభమూ, కించిత్తు రక్తదాహమూ కలుగుతున్నమాట వాస్తవమేగాని అవన్నీ స్వాతంత్ర్య లక్షణాలుగా భావించాలి. ఏమంటే డాలరుకుక్క కున్నంత స్వేచ్ఛ ప్రపంచంలో మరే కుక్కకూ లేదని చెబుతారు. దీనిక్కూడా అభ్యంతరం చెప్పేవాళ్ళు లేకపోలేదు. "స్వయం నిర్ణయశక్తిలేని కుక్కకి స్వేచ్ఛ ఏమిటి ? డాలరు కుక్కల కసలు మతేలేదు." అని వారి వాదం. ఈ సమస్యను తవ్వితే పారమార్థిక చింతలో పడిపోయి బయటికి రాలేం. అసలుస్వేచ్ఛ అనేదే ఒక భ్రమ అని అనుకుంటే సరిపోతుంది—దిబ్బకుక్కలకూ ఆధిష్ఠాన వర్గానికి దాస్యంచేసే స్వయం నిర్ణయాధికారం నిరాక్షేపణగా లభించింది గనక !

డాలరు కుక్కల ప్రభావం దిబ్బకుక్కల మీద ఏ విధంగా పని చేస్తున్నదీ తెలపటానికి ఇటీవల జరిగిన ఒక చిన్న సంఘటన మనవి చేస్తాను. రెండు మూడు దిబ్బ కుక్కలు ఒకరోజు అకస్మాత్తుగా మొరగడం ప్రారంభించాయి. ఇది మామూలు మొరుగుడు కాదు. దిబ్బదేశానికి ఏదో పెద్ద ప్రమాదమే వాటిల్లిందనీ, లేకపోతే ఇవి ఇంత గొంతులు చించుకుని మొరగవనీ అనుకున్నాను. ఇంతలో ఈ మొరిగే కుక్కలతో ఒకటి వెర్రెత్తినట్టు పరుగెత్తి ఎక్కడినుంచో ఒక పుస్తకాన్ని పట్టుకొచ్చింది. డాలరు కుక్కల కింద తరఫీదుతిన్న నాటు కుక్కలన్నీ దాని చుట్టూతా చేరి మొరగసాగాయి. దూరం నుంచి చూస్తే అది మామూలు "సోవియట్ లిటరేచర్" సంచికలాగే కనపడింది. కాని అందులో ఏవో ప్రమాదకర క్రిములు, అమెరికను విమానాలు కొరియా చైనాల మీద వేసిన రెట్టలలో ఉన్న క్రిములకన్నాకూడా అతి సూక్ష్మమైనవి, ఆ సంచికలలో ఉండి ఉండాలని దేశక్షేమం కోరినవారు ఊహించగలిగారు. ఈ "సోవియట్ లిటరేచర్" సంచికలను దిబ్బదేశం నుంచి బహిష్కరిస్తే దేశానికి మేలని బాధ్యతగల వారంటున్నారు.

అందుచేతను జాతికుక్కలవల్ల దిబ్బకుక్కలూ, వాటి ద్వారా దిబ్బ స్వాతంత్రం వగైరాలు లాభం పొందటం లేదనటానికి సుతరామూ వీల్లేదు.

ముద్రణ: 1 జూలై, 1952, ఉదయిని.